మురికి కూపంగా చెరువు



నర్సాపూర్ రాయరావు చెరువులోకి కాల్వల ద్వారా వెళ్తున్న మురికి నీరు

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే చెరువు మురికి కూపంగా తయారై దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు.

నర్సాపూర్:

నర్సాపూర్ పట్టణానికి చెందిన రాయరావు చెరువులోకి మురికినీరు వదులుతున్నారు. దీనితో చెరువంతా మురికి కూపంగా తయారవుతుంది. ఇంతా జరుగుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎన్జీఓస్ కాలనీలోని సుమారు సగం ఏరియాలోని ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు చెరువులోకి వెళ్తుంది. కాలనీలోని సగం ఏరియా ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు వేరే వైపు వెళ్లే అవకాశం లేనందున మురికి నీరంతా చాలా ఏళ్ల నుంచి చెరువులోకి వెళ్తుంది. రోజు ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు చెరువులోకి వెళ్లడంతో



చెరువు శిఖంలో ఏర్పడిన మురికి నీటిగుంత

చెరువులో ఇప్పటికే కొంత భాగం మురికిమయంగా తయారైంది. చెరువులోకి మురికినీరు వెళ్లడంతో చెరువు నుంచి దుర్వాసన వస్తుందని చెరువు సమీపంలో నివసిస్తున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నుంచి వస్తున్న మురికి నీరు కాల్వగా పారుతూ చెరువులోకి వెళ్తున్నందున చెరువు శిఖంలో పలుచోట్ల గుంతలు ఏర్పడడంతో శిఖం మురికి గుంతలమయంగా మారింది.

ప్రతిపాదనలకే పరిమితమైన ఎస్టీపీ నిర్మాణం

ఎన్జీఓస్ కాలనీలోని సగం ఏరియాలోని ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు చెరువులోకి వెళ్లకుండా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మించాలని సుమారు రెండేళ్ల క్రితం మున్సిపాలిటీ సమావేశంలో చర్చించారు. కాగా సమావేశంలో చర్చించి రెండేళ్లు దాటినా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎస్టీపీ నిర్మించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయమై సాగునీటి పారుదల శాఖ ఏఈ మణిబూషన్‌ను వివరణ కోరగా.. చెరువులోకి మురికి నీరు వెళ్తున్నందున మురికి నీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని గతంలో మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకుపోయానని సాగునీటి పారుదల శాఖ ఏఈ మణిబూషన్ తెలిపారు. మరోసారి కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకుపోతానని అన్నారు. చెరువులోకి మురికి నీరు రావడం సరైన పద్ధతి కాదని ఆయన చెప్పారు.

ఎస్టీపీ నిర్మించాలి



ఎన్జీఓస్ కాలనీలోని కొంత ఏరియా నుంచి మురికి నీరు చెరువులోకి వెళ్తున్నందున నీరు చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని గతంలో మున్సిపాలిటీ సమావేశంలో కోరా. ఎస్టీపీ ప్లాంట్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. ప్రజల అవసరాల కోసం చెరువు పాడవకుండా ఎస్టీపీ ప్లాంట్ నిర్మించాలి.

– లత, రెండో వార్డు కౌన్సిలర్

ప్రతిపాదనలు పంపాం



చెరువులోకి మురికి నీరు వెళ్లకుండా చర్యల్లో భాగంగా ఎస్టీపీ నిర్మించేందుకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులు చేపడుతాం.

– అశోక్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్

క్లుప్తంగా

నల్లపోచమ్మ జాతర



బండ్లపై ఊరేగింపులో ఎమ్మెల్యే రోహిత్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని ముత్తభూపతిపూర్ గ్రామంలో నల్లపోచమ్మ జాతరకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఆలయం చుట్టూ ఊరేగిస్తున్న బండ్లపై ఎక్కారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌చౌదరి, హఫీజుద్దీన్, నాగరాజు, సిద్ధాగౌడ్, మురళి, ఘట్టాగౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మంభోజిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి పల్లకిసేవలో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలస్వామి రామావతారంలో దర్శనమించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో పానగారి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రెడ్యా తండాలో దుర్గామాత ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రెడ్యా తండాలో దుర్గామాత ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో తండా వాసులు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దుర్గమాతను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా, బీజేపీ నాయకులు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, రఘువీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పాఠశాలలో బాత్‌రూం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మంగళవారం పర్యటించారు. పట్టణంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు, అంగన్‌వాడీ కేంద్రం ఎదుట సీసీ ఫ్లోర్ నిర్మాణ పనులు, ప్రాథమిక పాఠశాల వద్ద బాత్‌రూం నిర్మాణ పనులు, ఖాజీ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పనులు పరిశీలించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అశోక్‌గౌడ్ మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

చేగుంట(తూప్రాన్): చేతిరాత శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. మండల కేంద్రంలోని సాధన డిగ్రీ కళాశాలలో ఇటీవల విద్యార్థులకు ఉచితంగా చేతిరాత శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులకు పరీక్షను నిర్వహించి, ఉత్తీర్ణత సాధించిన వారికి కరస్పాండెంట్ రాజగోపాల్ సర్టిఫికెట్లు అందించారు. చేతిరాత నిపుణుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాలొన్నారు.

పీర్లతండాలో ప్రత్యేక పూజలు



పీర్లతండాలో ఆలయం వద్ద పూజలు చేస్తున్న తండావాసులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని పీర్లతండాలో శ్రీజగదాంబ మాత, సేవాలాల్ మాహారాజ్ ఆలయం వద్ద తండావాసులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ సంవత్సరం తండావాసులు ఆలయం వద్ద సామూహికంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. అందులో భాగంగా మంగళవారం ఆలయ అర్చకుడు లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలు తీసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, తండా నాయకులు ప్రవీణ్, రవి, జగన్, ధన్‌రాజ్, సర్దార్ పాల్గొన్నారు.



నర్సాపూర్: రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రామాయంపేటలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

నర్సాపూర్: దేశ మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, ఫ్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ క్యాంపు కార్యాలయంలో ..

మెదక్ కలెక్టరేట్: మెదక్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో నాయకులు సురేందర్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, శేఖర్, హఫీజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): పట్టణంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన వారిలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు యాదగిరి, గంగాధర్, సుందర్‌సింగ్, దోమకొండ యాదగిరి, కార్యకర్తలు తదితరులున్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన వారిలో మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, మల్లేశం, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, పోతిరెడ్డి, శ్రీనివాస్, కుస్తి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట మండల కేంద్రంలో

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో రాజీవ్



నిజాంపేటలో ..

గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మారుతి, పట్టణ అధ్యక్షుడు నసీరొద్దీన్, సత్యనారయణ, పంజా మహేందర్, లింగంగౌడ్, నరేందర్, లక్ష్మణ్ గౌడ్, బాబు, రమేశ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ ఆవుల గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజకుమార్‌గౌడ్, మోహన్‌నాయక్, సాయిలు, రామ్‌చంద్రం, రామస్వామి తదితరులున్నారు.

కొల్చారంలో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన వారిలో మండలాధ్యక్షుడు మల్లేశం గౌడ్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు వెంకట్ గౌడ్, రూప్ల తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

మండల ప్రత్యేక, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు

నర్సాపూర్: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని మండల ప్రత్యేక, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు చెప్పారు. ఆయన మంగళవారం మండలంలోని రెడ్డిపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సెంటరులో ఉన్న ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసి ఇతర జిల్లాలకు పంపాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సెంటర్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఎం గౌరీశంకర్, ఇతర సిబ్బంది ఉన్నారు.



రెడ్డిపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు

కొనుగోలు కేంద్రాల పరిశీలన



పెద్దశంకరంపేటలో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గ్రేస్‌బాయి మంగళవారం సందర్శించారు. పేటలోని సబ్‌మార్కెట్ యార్డు వద్ద రైతులు తెచ్చిన ధాన్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా వెంటవెంటనే తరలించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే ఖాళీ చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రవీందర్, ఆర్ఐ.శరణప్ప తదితరులు ఉన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ కల్లూరి హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): స్వచ్ఛంద సంస్థలు రైతుల కోసం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లలోని పటేల్ చెరువులో సెగల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ పథకం ద్వారా పొలాలకు మట్టి తరలింపు పనులను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు మట్టిని పొలాలకు తరలించడం ద్వారా సాగు దిగుబడి పెరుగుతుందన్నారు. సంస్థ ద్వారా రైతులు విత్తనాలు, పనిముట్లను ఇవ్వడంతో రైతులు ఆర్థిక అభివృద్ధికి దోహదం పడుతుందన్నారు. సెగల్ సంస్థ కో ఆర్డినేటర్ వేమనారాయణ మాట్లాడుతూ.. చెరువు పూడిక తీయడంతో పాటు కట్ట వెడల్పు పనులు చేయడం జరుగుతుందన్నారు. మట్టి తవ్వకానికి సంస్థ జేసీబీ ఏర్పాటు చేస్తుందని, రైతులు ట్రాకర్లు సమకూర్చుకుని మట్టిని పొలాలకు తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దశరథ్, రైతులు నారాయణరావు, నర్సింగరావు, నరేందర్, భిక్షపతిరావు, హర్జనాయక్, పాపయ్యచారి, శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ హరికృష్ణ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నర్సాపూర్: మండలంలోని పలు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. నర్సాపూర్‌లోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మేంటెనెన్స్ పనులు చేస్తుండటంతో మండలంలోని నర్సాపూర్, అవంచ, రెడ్డిపల్లి, చిప్పల్‌తుర్తి, కాగజ్‌మద్దూర్, లింగాపూర్, మూసాపేటతో పాటు హత్నూర మండలంలోని నస్తీపూర్, దౌల్తాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ దుర్గప్రసాద్ తెలిపారు. ట్రాన్స్‌మిషన్ మరమ్మతుల్లో భాగంగా కొత్తపేట, పిల్లుట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అల్లిపూర్, కొత్తపేట, పిల్లుట్ల, లింగోజిగూడ, రత్నపూర్ పంచాయతీల్లో, రూప్ల, సీతారం, గేమ్‌సింగ్ తండాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నట్లు ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలో 40 సీట్ల చొప్పున 160 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఇందులో ప్రవేశానికి ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జీలుగు విత్తనాల కోసం ఎదురుచూపు

కౌడిపల్లి(నర్సాపూర్): భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలు జీలుగు, జనుము కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారన్ని పెంచేందుకు జీలుగు, జనుము విత్తనాలు ఎంతో ఉపయోగపడుతాయి. పచ్చిరొట్ట విత్తనాలకు మంచి డిమాండ్ ఉంది. రెండు రోజుల క్రితం స్థానిక ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 60క్వింటాళ్ల జీలుగు విత్తనాలు రాగా, గంట సేపట్లో అయిపోయాయి. మండలానికి 400 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అవసరం ఉన్నట్లు పంపినట్లు ఏఓ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందర్‌రావు

మెదక్‌జోన్: కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మన గెలుపు ఖాయమైందని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో పాపన్నపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారంతా మోదీ కుటుంబ సభ్యులని వారిని కొనియాడారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొండా రాములు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, నాయకులు శ్రీనివాస్, సతీష్, నాయినిప్రసాద్, తదితరులు ఉన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రఘునందన్‌రావు

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

తూప్రాన్: పట్టణంలో అతి పురాతన శ్రీకూర్మనర్సింహస్వామి దేవాలయం 41వ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఇందులో భాగంగా రెండో రోజు అర్చకుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, హనుమాన్‌కు ఆకు పూజ, చందన విలేఖనం, సుదర్శన హోమం చేశారు. బుధవారం ఉదయం హోమం, స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మున్సిపల్ చైర్మన్ జ్యోతి కృష్ణ, శ్రీచూర్ణం విద్యాసాగర్, అహోబిలం హరి ప్రసాద్, కంటాయపాలెం వేణుగోపాల్ గడ్డం ప్రశాంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్

మెదక్‌జోన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో గత నెల నుంచి నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ మంగళవారం ఉత్సాహంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పెంట గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్యాంప్ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ సమ్మర్ క్యాంప్‌లో యువకులు ఉత్సాహంగా పాల్గొని కోచ్‌ల ఆధ్వర్యంలో తమ నైపుణ్యాన్ని మెరుగు పర్చుకున్నారని తెలిపారు. ఇక్కడ మెలకువలు నేర్చుకున్న క్రీడాకారులు భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల యువకులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. క్రీడాకారులకు ఆటతో పాటు క్రమశిక్షణ ముఖ్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు ఎంఎల్ఎస్‌రెడ్డి, జుబేర్, సలీం ఉమర్, అర్జున్, అబ్దుల్లా నాగి రెడ్డి, అరవింద్, వినోద్, సాయి పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సంక్షిప్త వార్తలు

◆ **మైనంపల్లికి మంత్రి పదవి కోసం ప్రార్థనలు**

చిన్నశంకరంపేట(మెదక్): మైనంపల్లి హన్మంతరావుకు కెబినెట్ విస్తరణలో మంత్రి పదవి దక్కాలని నార్సింగి కాంగ్రెస్ మండల నాయకులు ముంబాయిలోని హజిఅలీ దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ప్రార్థనలు నిర్వహించిన వారిలో అంచనూరి రాజేశ్, చందుయాదవ్ తదితరులు ఉన్నారు.

◆ **తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి**

చేగుంట(తూప్రాన్): తడిసిన ధాన్యం ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతుల తడిసిన ధాన్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కొనుగోలు కేంద్రాల ధాన్యం వేగంగా కొనుగోలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి సభ్యులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): భారీ వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్య యాదవ్ ప్రభుత్వమే డిమాండ్ చేశారు.మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యం, రవాణా ఇబ్బందులపై రైతులతో చర్చించారు.

◆ **లారీల కొరత తీర్చండి**

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం వెంటనే రైస్‌మిల్లులకు తరలించేందుకు అధికారులు వెంటనే లారీలను సమకూర్చాలని రైతు పరిరక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ ధాన్యం కాంటా చేయడం లేదన్నారు. కాంటా చేసిన ధాన్యం రైస్‌మిల్‌కు తరలించడంతో అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం తడిసిముద్దయితుందన్నారు. దీంతో ధాన్యం మరోసారి ఆరబెట్టాలని రైతులను వేధిస్తున్నారన్నారు. అధికారులు వెంట వెంటనే ధాన్యాన్ని రైస్‌మిల్‌కు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట వెంకటేశం ఉన్నారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని హకింపేట గ్రామానికి చెందిన పత్తి నవ్య కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సిద్ధిరాములుగౌడ్, నాగరాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ **బోరుబావి తవ్వకం పనులు నిలిపివేత**

శివ్వంపేట(నర్సాపూర్): ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఆలయం వద్ద కాంగ్రెస్ నాయకులు బోరుబావి తవ్వకం చేపడుతుండగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని గోమారం గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన బీరప్ప ఆలయం వద్ద కాంగ్రెస్ నాయకులు మంగళవారం బోరుబావి తవ్వకం పనులు చేస్తుండగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ విషయం గురించి తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి ఫిర్యాదు చేయడంతో బోరుబావి తవ్వకం పనులు నిలిపివేయించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. యాదవ సంఘం నేతలు ఆలయం వద్ద బోరుబావి తవ్వించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డికి కోరగా.. ఎన్నికల కోడ్ ముగిశాగా తవ్విస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు కోడ్ అమలులో ఉండగానే కాంగ్రెస్ నాయకులు బోరుబావి తవ్వకం చేపట్టడం ఎంటని ప్రశ్నించారు.